గురుకులాల్లో సమస్యలు పరిష్కరించకుంటే

అసెంబ్లీని ముట్టడిస్తాం..

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్

బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్

కామారెడ్డి రూరల్, డిసెంబర్ 8: గురుకులాల్లో సమస్యలు పరిష్కరించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కామారెడ్డిలోని ఆర్ అండ్బీ అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకుల బాటలో భాగంగా జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్వీ క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించిందని తెలిపారు. కొన్ని గురుకులాల్లో విద్యార్థి సంఘం నాయకులతోపాటు తల్లిదండ్రులను అనుమతించలేదన్నారు. గురుకులాల్లో పోషకాహార లోపం, అస్తవ్యస్త పారిశుద్ధ్యం, తాగునీటి కొరత, అపరిశుభ్ర వాష్‌రూములు, డైనేజీ సరిగా లేకపోవడం తదితర సమస్యలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. సమస్యలను పరిష్కరించకుంటే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకా రం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ పట్టణ అధ్యక్షుడు చెలిమెల భానుప్రసాద్, బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ యూత్ నాయకులు పరశురాంగౌడ్, సాయి, రాజేశ్, ఆషూ, సాయి, సాకేత్, దీపక్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- తల్లీకొడుకు దుర్మరణం : మరో ఇద్దరికి గాయాలు
- భిక్కనూరు వద్ద ఘటన
- మృతులు బాన్సువాడ వాసులు
- పుట్టిన రోజున మృతిచెందిన అక్షయ్

మృతులు లక్ష్మి, అక్షయ్‌రెడ్డి(ఫైల్)

భిక్కనూరు, డిసెంబర్ 8: ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో తల్లీకుమారుడు మృతిచెందిన ఘటన మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం చోటుచేసుకున్నది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడకు చెందిన కంచర్ల నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం నాలుగు గంటలకు హైదరాబాద్ నుంచి బాన్సువాడకు కారులో బయల్దేరారు. ఈ క్రమంలో భిక్కనూరు శివారులో జాతీయ రహదారిపై ఎలాంటి ఇండికేషన్ లేకుండా ఆగి ఉన్న నాగాలాండ్‌కు చెందిన ఓపెన్ ట్రైలర్ లారీని పొగమంచు కారణంగా వెనుక నుంచి కారు ఢీకొన్నది. ఈ ఘటనలో కారు లారీ కిందికి చొచ్చుకు పోయింది. దీంతో కారు నడుపుతున్న అక్షయ్‌రెడ్డి(28) అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదంలో లక్ష్మి, రాజేశ్వర్, భూమవ్వకు తీవ్ర గాయాలు కాగా.. స్థానికులు 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ కిమ్స్ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ లక్ష్మి(49) మృతిచెందింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎలాంటి ఇండికేషన్ లేకుండా రోడ్డుపై లారీని నిలిపినందుకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

బాన్సువాడలో విషాదం..

బాన్సువాడ, డిసెంబర్ 8: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందడంతో పాత బాన్సువాడలో విషాదం నెలకొన్నది. బాన్సువాడకు చెందిన మాజీ సర్పంచ్ కొర్ల సంగారెడ్డి కూతురు లక్ష్మి, ఆమె కుమారుడు అక్షయ్‌రెడ్డి ప్రమాదంలో మృతిచెందారన్న విషయం తెలుసుకున్న పలువురు బాధిత కుటుంబం ఉండే ఇంటికి తరలివచ్చారు. ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు. పుట్టిన రోజునే అక్షయ్‌రెడ్డి మృతిచెందడంతో మిత్రులు, బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు. అక్షయ్ అందరితో కలుపుగోలుగా ఉండేవాడని స్నేహితులు తెలిపారు.

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఘటనా స్థలంలో క్షతగాత్రులు

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పోచారం

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

బీబీపేట్,(దోమకొండ) డిసెంబర్ 8: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతున్నదని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి డెబిట్, క్రెడిట్ కార్డులను అప్‌డేట్ చేయాలని, బహుమతి వచ్చిందని ప్రాసెసింగ్ ఫీజు కోసం కొన్ని డబ్బులు పంపాలని అడుగుతారని పేర్కొన్నారు. వారి మాటలు నమ్మవద్దని సూచించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి లోన్లు మంజూరయ్యాయని, వివిధ రకాల యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని చెబుతారని, వాటిని ఇన్‌స్టాల్ చేసి వివరాలను నమోదు చేస్తే మీ బ్యాంకు ఖాతాలోని డబ్బులు సైబర్ నేరాగాళ్ల బ్యాంకు ఖాతాలోకి వెళ్తాయని తెలిపారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా బీఆర్ఎస్

బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

లింగంపేట, డిసెంబర్ 8: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటుందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మండలంలోని మెంగారం, పర్మళ్ల, సజ్జన్‌పల్లి గ్రామాల్లో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను ఆదివారం ఆయన పరామర్శించారు. బీఆర్ఎస్ అభ్యున్నతికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. పర్మళ్ల గ్రామానికి చెందిన గంట సంతోష్ బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి, ఇటీవల మృతి చెందాడు. దీంతో మృతుని కుటుంబ సభ్యులకు రెండు లక్షల రూపాయల పార్టీ బీమా చెక్కును మాజీ ఎమ్మెల్యే అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు నాయకులు గన్నానాయక్, నర్సింహులు, శ్రీనివాస్, రవీందర్ నాయక్, శ్రీకాంత్, చెన్నం సాయిలు, వివేకానంద తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్‌కు భిక్కనూరు విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భిక్కనూరు, డిసెంబర్ 8: భిక్కనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌కు ఎంపికయ్యారు. 52వ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు స్ఫూర్తి సాయి, శ్రేయస్ కలిసి సైన్స్ ఉపాధ్యాయులు తమ్మల రాజు, సరిత మార్గదర్శనంలో సహజ వ్యవసాయం అంశంలో వ్యవసాయ పద్ధతులపై ప్రదర్శించిన కృషి విజ్ఞాన మంత్ర ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. బాన్సువాడలో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో తమ పాఠశాల నుంచి ఐదు ప్రదర్శనలు ఏర్పాటుచేశామని చెప్పారు. అందులో ఒకటి రాష్ట్రస్థాయికి ఎంపికవడం ఆనందంగా ఉన్నదన్నారు. రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్‌కు ఎంపికైన విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, ఎంఈవో రాజగంగారెడ్డి తదితరులు అభినందించారు.

నేటి నుంచి మెగా లోక్ అదాలత్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 8: ఎల్లారెడ్డి కోర్టు పరిధిలో నేటి నుంచి 14వ తేదీ వరకు మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ ఆదివారం తెలిపారు. వివాదాలు పెంచుకుటే.. జీవితకాలం కొనసాగుతాయని, రాజీ మార్గంలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే పీసీ నరేందర్ 8712526429 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు.

108 వాహనం మంజూరు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 8: నాగిరెడ్డిపేట మండలానికి నూతనంగా 108 వాహనం మంజూరైనట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సృజన్‌కుమార్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు వాహన ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

వాహనాల తనిఖీ

లింగంపేట, డిసెంబర్ 8: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట పోలీసులు ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లు పరిశీలించారు. వాటిని వెంటనే చెల్లించాలని వాహన దారులకు సూచించారు. వాహనాలపై పెండింగ్ చలాన్లు ఉంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టును విధిగా ధరించాలన్నారు. ఈ సందర్భంగా వాహన ధ్రువపత్రాలు లేని, ట్రాఫిక్ నిబంధనలు పాటించని పలు వాహనదారులకు జరిమానా విధించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

త్రిలింగేశ్వరాలయానికి పూర్వవైభవం తీసుకువస్తాం

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 8: తాండూర్ త్రిలింగేశ్వరాలయానికి పూర్వ వైభవం తీసుకు వస్తామని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. శనివారం రాత్రి ఆయన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయరామారావుతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలోని శివుడికి అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల ఆలయంలో నిర్వహించిన యాగంలో పాల్గొన్న 14 వేద పండితులకు శాలువాలు కప్పి సత్కరించారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న వారిని సత్కరించారు.

108 అంబులెన్స్ ప్రారంభం

108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

మద్నూర్, డిసెంబర్ 8: మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో 108 అంబులెన్స్‌ను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదివారం ప్రారంభించారు. మండల ప్రజలు అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు సాయిపటేల్, హన్మాండ్లు స్వామి, సాయిలు, ప్రజ్ఞకుమార్, శ్రీనూపటేల్, కొండ గంగాధర్, వట్నాల రమేశ్, గోపి, లక్ష్మణ్, రాములు, అమూల్, సచిన్, హన్మంత్, బాలు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంజనాద్రి ఆలయ వార్షికోత్సవం

ఉత్సవాలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే హన్మంతషిండే

నిజాంసాగర్, డిసెంబర్ 8: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో అంజనాద్రి ఆలయ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన ఉత్సవాల్లో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంతషిండే, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, ఏఎంసీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు కిశోర్‌కుమార్ వారిని సన్మానించారు. పూజా కార్యక్రమాల్లో నాయకులు ఏలె మల్లికార్జున్, మోహన్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, వాజీద్ అలీ, రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎస్సై ఇంట్లో చోరీ

బిచ్కుంద, డిసెంబర్ 8: జుక్కల్ మండలంలోని లాడేగావ్ గ్రామానికి చెందిన ఓ రిటైర్డ్ ఎస్సై ఇంట్లో చోరీ జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎస్సై తుకారాం శనివారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. దుండగులు ఇంటి పైకప్పు నుంచి ఇంట్లోకి చొరబడి బీరువాను ధ్వంసం చేశారు. అతడు ఆదివారం వచ్చి చూడగా.. ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి, హుండీలోని రూ.మూడు వేలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఆరు నెలల నుంచి గ్రామంలో 18 వరకు చోరీలు జరిగాయని గ్రామస్తులు తెలిపారు. పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని వారు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ స్కూల్ పిల్లల బట్టలు వాషింగ్ మెషిన్‌పై ఉతికి ఇస్త్రీ చేయుటకు రజకులు కావలెను. ఉచిత వసతి, భోజన సౌకర్యం కలదు. సంప్రదించు సెల్:9440758535, 9010286434

NTZ-334432

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పుస్తెమెట్టెల వితరణ



పుస్తెమట్టెలను అందజేస్తున్న బ్రహ్మానందరెడ్డి

మాచారెడ్డి, డిసెంబర్ 8: మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన బోయిని నర్సయ్య కుమార్తె కల్పన వివాహం ఆదివారం జరిగింది. వధువుకు నాయకుడు బ్రహ్మానందరెడ్డి పుస్తెమట్టెలను పంపిణీ చేశారు. కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సయ్య గాయపడగా.. అతడి కుమార్తె వివాహానికి తనవంతు సాయంగా పుస్తెమట్టెలను అందజేసినట్లు బ్రహ్మానందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, నరేశ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, బాల్‌చంద్రాగౌడ్, నర్సయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుమార్తె పెండ్లికి ఆర్థిక సహాయం

ఆర్థిక సహాయం అందజేస్తున్న నర్సింహులు మిత్రులు

రాజంపేట్, డిసెంబర్ 8: మండలంలోని పొందుర్తి గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింహులు కొంతకాలం క్రితం మరణించాడు. అతడి కుమార్తె సింధూజ వివాహం ఆదివారం నిర్వహించారు. కాగా.. నర్సింహులుతో కలిసి తల మడ్ల పాఠశాలలో 2002వ సంవత్సరంలో పదో తరగతి చదివిన మిత్రులు సింధూజ వివాహానికి ఆర్థిక సహాయం చేశారు. తమవంతుగా రూ.10,011 నర్సింహులు భార్య స్వప్నకు అందజేశారు.

మొబైల్ ఫోన్ అందజేత

మాచారెడ్డి, డిసెంబర్ 8 : మండలంలోని ఎల్లంపేటకు చెందిన కొమురయ్య ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. పూర్తి వివరాలతో బాధితుడు మాచారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను ట్రేస్ చేశారు. బాధితుడికి ఎస్సై అనిల్ ఆదివారం అందజేశారు. ఫోన్ పోగొట్టుకున్న వారు పూర్తి వివరాలతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పెద్దకొడప్‌గల్, డిసెంబర్ 8: మండలంలో 13 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ము బారక్ చెక్కులను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదివారం పంపిణీ చేశారు. తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ముగ్గురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ దశరథ్, గిర్దావర్ అంజయ్య, నాయకులు మల్లప్ప పటేల్, హైమద్, మారుతి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద అభివృద్ధి పనులు ప్రారంభం

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

లింగంపేట, డిసెంబర్ 8: లింగంపేటలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద అభివృద్ధి పనులను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు సేకరించిన విరాళాలతో పనులను చేపట్టనున్నారు. ఆలయం చుట్టూ ఉన్న ప్రదేశాన్ని చదును చేసే పనులు ప్రారంభించారు. మండల కేంద్రం నుంచి ఆలయం వరకు రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఆ పనులు కూడా ప్రారంభమయ్యాయి.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు

పేట్ సంగెం విద్యార్థిని

సరిత

గాంధారి, డిసెంబర్ 8: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని పేట్ సంగెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన నేనావత్ సరిత ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ ఆదివారం తెలిపారు. ఇటీవల కామారెడ్డిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీల్లో సరిత ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. దీంతో నిర్వాహకులు ఆమెను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారని తెలిపారు. విద్యార్థినిని హెచ్ఎం కుమార స్వామితోపాటు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

బిచ్కుంద ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

బిచ్కుంద, డిసెంబర్ 8: బిచ్కుంద వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వాజిద్‌నగర్‌లో ఆదివారం నిర్వహించారు. ఏఎంసీ చైర్‌పర్సన్‌గా దొడ్ల కవిత, వైస్ చైర్మన్‌గా శంకర్‌తోపాటు 16 మంది పాలకవర్గ సభ్యులతో జిల్లా మార్కెటింగ్ అధికారిణి రమ్య ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారు బిచ్కుంద ఏఎంసీ కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ సురేశ్‌షెట్కార్, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హాజరయ్యారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మల్లికార్జున్ అప్ప, పుల్కల్ సొసైటీ మాజీ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ కవిత

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన మాస్టర్స్

కామారెడ్డి రూరల్, డిసెంబర్ 8: జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రన్నింగ్, డిస్కస్ త్రో, లాంగ్, హై జంప్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రణజిత్ మోహన్, గౌరవ అధ్యక్షుడు రాజన్న, ప్రధాన కార్యదర్శి నరేశ్, పి.రవిప్రసాద్, డాక్టర్ కేపీ అనిల్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి జి.నవీన్, ఏ.మహేందర్ చారి, రాజేందర్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, అతీకుల్లా పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన వైస్ ప్రెసిడెంట్ రవిప్రసాద్, జ్ఞానేశ్వరి విజేతలకు బహుమతులు అందజేశారు. రాష్ట్ర స్థాయికి లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌కుమార్, కేపీ అనిల్‌కుమార్, అతీకుల్లా, చంద్రశేఖర్, నరేశ్, మహేందర్‌చారి, జి.నవీన్, రాజేందర్, సతీశ్, నరేశ్‌రెడ్డి, సబాత్ కృష్ణ, నరేందర్, కే.రవి, అనిల్‌కుమార్, రాజేందర్, రవీందర్‌రెడ్డి, రాజశేఖర్, సురేశ్, సంతోష్, సునీల్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శివాజీ, ఎం.సమత, ఎం.సుధ ఎంపికయ్యారని ప్రధాన కార్యదర్శి డి.నరేశ్ తెలిపారు.

భూముల వేలము ప్రకటన

ది.నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, బ్రాంచి: లింగంపేట్, మం॥లింగంపేట్, జి॥కామారెడ్డి (యస్.సి.డి.ఆర్ / ఆఫీసర్ ఆన్‌స్పెషల్ డ్యూటీ ఎన్.డి.సి.సి. బ్యాంక్ లి., నిజామాబాద్ వారి ఉత్తర్వులననుసరించి)

ఇందుమూలముగా తెలియపరుచునది ఏమనగా ది.నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, బ్రాంచి లింగంపేట్, మం॥ లింగంపేట్, జి॥ కామారెడ్డినకు బాకీ పడిన సొమ్ము మొత్తమును రాబట్టుటకు గాను ఈ దిగువ తెలిపిన తనఖా చేయబడిన భూములను తెలంగాణ సహకార సంఘాల చట్టంలోని రూలు 52 ప్రకారము బహిరంగ వేలము ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది. కావున సదరు వేలములో పాల్గొనుటకు ఆసక్తిగలవారు ఈ దిగువ తెలుపబడిన షరతులు మరియు నిబంధనలకు లోబడి పాల్గొనగలరు.

బాకీదారుని /తనఖాదారుని తండ్రి / భర్త పేరు	అమ్మబడు తనఖా వ్యవసాయ భూమి వివరాలు			వేలము తేది సమయం స్థలం	ఇ.పి.నెం.బాకీ బడిన సొమ్ము	వేలము నందు పాల్గొనుటకు ధరావత్తు సొమ్ము
	సర్వే నెం.	విస్తీర్ణం (ఎ. గుంట)	శివారు			
శ్రీ జి.నరహరి (బాకీదారు) తండ్రి: వీరయ్య గ్రా॥లింగంపేట్, మం॥ లింగంపేట్, జి॥ కామారెడ్డి	Open Plot Survey No. 14/C2	300.00 Sq.Yards Boundaries N: Canal S: 12"Road E: K.Sailu W: Laxmi Narayana	లింగంపేట్	తేది: 10.12.2024 మంగళవారము ఉ॥11-00 గం॥లకు లింగంపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో	ఇ.పి.నెం. 170/Com/2021-22 రూ॥8,64,938/- అదనంగా (+) వడ్డీ (+) అపరాధపు వడ్డీ (+) తదుపరి కిస్తులు ఉన్నచో వడ్డీతో సహా (+) జప్తు ఖర్చులు (+) ఇతర ఖర్చులు	రూ॥10,000/-

షరతులు మరియు నిబంధనలు

1. పైన తెలుపబడిన తనఖా చేయబడిన భూముల వేలము వేయుటకు అమ్మకపు అధికారికి పూర్తి అధికారము గలదు.
2. వేలము బహిరంగముగా జరుపబడును.
3. ప్రకటనలో తెలిపిన బాకీదారుని ఆస్తి ఏకమొత్తములో వేలము వేయుటకు సేల్ ఆఫీసర్ గారికి అధికారము కలదు.
4.వేలము సమయమునకు ముందుగా బకాయిదారులు గాని అతని ప్రతినిధి గాని బాకీ పడిన సొమ్ము చెల్లించిన యెడల వేలము వాయిదా వేయబడును లేదా రద్దు చేయబడును.
5.వేలము నందు పాల్గొనుటకు ఆసక్తి గలవారు ధరావత్తు సొమ్మును ముందుగా అమ్మకపు అధికారికి గాని సంఘ కార్యదర్శికి గాని డిడి లేదా నగదు రూపేణా స్వయంగా లేదా ప్రతినిధి ద్వారా చెల్లించి రశీదు పొందగలరు. సదరు వేలము వాయిదా బడిన లేదా రద్దు అయినచో సదరు వ్యక్తి ఏ కారణముచేనైనా వేలములో పాల్గొనుటకు ఇష్టపడని యెడల ఇట్టి ధరావత్తు సొమ్ము వాపసు చేయబడును.
6.ధరావత్తు సొమ్ము చెల్లించిన వారు మాత్రమే వేలములో పాల్గొనుటకు అర్హులు.
7.సదరు వేలమునందు అధిక ధర పాట పాడిన వారికి వ్యవసాయ భూమిని (ఉన్నది ఉన్నట్లుగా) అప్పగించుటకు సేల్ ఆఫీసర్ గారికి అధికారము గలదు. వేలము తేది నుండి (30 రోజుల) తరువాత సేల్ సర్టిఫికేట్ ఇవ్వబడును.
8. సదరు వేలములో అధికముగా వేలం పాట పాడిన వ్యక్తి వేలం పాడిన కొనుగోలు సొమ్ము మొత్తములో 15శాతం సొమ్ము తక్షణమే డిపాజిట్ చేయవలెను. మిగతా సొమ్మును 15రోజుల గడువు లోపుగా చెల్లించవలెను. గడువులోగా పూర్తి సొమ్మును కొనుగోలుదారు చెల్లించని యెడల 15% డిపాజిట్ సొమ్మును వేలం పాటదారుడు కోల్పోగలడు. మరియు అట్టి ఆస్తి తిరిగి వేలం వేయబడును. కొనుగోలుదారుడు అట్టి ఆస్తిని గాని, అది అమ్మబడిన తరువాత ఏదేని భాగమునకు గాని అన్ని హక్కులను వదులుకొనవలెను. మొదటి కొనుగోలు